22-6-2000 ఆంధ్రప్రభ

ఏజెన్సీలో ప్రైవేట్ మైనింగ్

# రాజ్యాంగం ఏమంటోంది?

**ఏజెన్సీలో ప్రయివేట్ మైనింగ్ లీజులు ఇవ్వడం ఆదివాసీల మంచికోసమేనని రాష్ట్ర ప్రభుత్వం దబాయించజూస్తున్నది. బాక్సైట్ గనులనూ, అల్యూమినియం ఫ్యాక్టరీనీ ప్రభుత్వం ప్రయివేట్ కంపెనీల ద్వారా నడిపించాలని ప్రతిపాదిస్తున్నది. ప్రయివేట్ రంగంలో ఏ రకమైన రిజర్వేషన్లూ మన దేశంలో లేవు. రిజర్వేషన్లు లేకుండా ప్రయివేట్ కంపెనీలు తమంతట తాము ఆదివాసీలకు ఉద్యోగాలిస్తాయా?**



కె.బాలగోపాల్

నిత్యం గండం ఎదుర్కొనే విషయాలు ఈ ప్రపంచంలో కొన్ని ఉంటాయి.

వాటిలో ఒకటి షెడ్యూల్డు ప్రాంతాలలో ఆదివాసీల భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడే ఉద్దేశంతో ఉనికిలోకి వచ్చిన ఎల్. టి. ఆర్. చట్టం. షెడ్యూల్డు ప్రాంతాలలో ఎప్పటి నుంచో నివాసముంటున్న గిరిజనేతర చిన్న రైతుల సమస్యల పేరిట ఆ చట్టాన్ని సవరించాలన్న డిమాండ్, సవరించే ప్రయత్నాలు ఒక దశాబ్ద కాలంపైగా జరుగుతున్నవే.

ఇప్పుడు వేరే కోణం నుంచి గండం వచ్చింది. దాని పేరు 'అభివృద్ధి'. రాష్ట్రంలోని ఉత్తరాంధ్ర జిల్లాలలోని షెడ్యూల్డు ప్రాంతాలలో అల్యూమినియం లోహానికి ముడి ఖనిజమైన బాక్సైట్ విస్తారంగా దొరుకుతుందనేది చాలా కాలంగా తెలిసిన విషయమే. దానిని ప్రభుత్వరంగ ఖనిజ ఉత్పత్తి సంస్థలచేత తవ్వితీయించే ప్రయత్నం చేసి ఉంటే ఎల్. టి. ఆర్. చట్టం అడ్డు వచ్చి ఉండేది కాదు. అయినప్పటికీ ఆదివాసీల బతుకులపైన అది తీవ్ర దుష్ప్రభావం వేసి ఉండేదనేది వేరే సంగతి.

కారణమేమయితేనేం, ఆ మూడు జిల్లాలలోని తూర్పు కనుమల కొండలలో ఉన్న బాక్సైట్ ఖనిజాన్ని వెలికి తీసే ప్రయత్నం ఎప్పుడూ జరగలేదు. రెండేళ్ళుగా మాత్రం చంద్రబాబు ప్రభుత్వం ఆ ఖనిజమంతా వృధాగా ఉండిపోవడం రాష్ట్రానికీ, రాష్ట్ర అభివృద్ధికీ చాలా నష్టం అని పదే పదే అంటున్నది.

అయితే ఇప్పుడిక ప్రభుత్వరంగంలో ఏదీ చేపట్టబోవడం లేదు కాబట్టి ఆ ఖనిజాన్ని వెలికితీసే మైనింగ్ ప్రక్రియనూ, దాని నుండి అల్యూమినియం తీసే పరిశ్రమలనూ ప్రైవేట్ పెట్టుబడిదార్లకు అప్పగించే ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం నెమ్మదిగా ప్రచారంలో పెట్టింది. కేవలం ఆదివాసీల ప్రయోజనాల పేరిట అంత విస్తారంగా లభ్యమయ్యే ఖనిజాన్ని వాడుకోకుండా ఉండడం తెలివితక్కువతనమనీ, ఆ పని ప్రైవేట్ కంపెనీలకు అప్పగించడానికి చట్టంలో ఉన్న ఆటంకాలను తొలగించాలనీ రెండే రెండు వాక్యాలలో విజన్ —2020 లో చెప్పబడింది. ఆ 'స్వర్ణాంధ్ర ప్రదేశ్' ప్రణాళికలో ఆదివాసీల గురించి ఉన్నది ఆ రెండు వాక్యాలే కావడం విశేషం!

ఇప్పుడు ఆ అభిప్రాయానికి రాష్ట్ర ప్రభుత్వం కార్యరూపం ఇవ్వడానికి పూనుకుంది. అంటే ఏజెన్సీలో ప్రయివేట్ మైనింగ్‌కు ఆటంకంగా ఉన్న చట్టాలను సవరించడానికి పూనుకుంది. ఎల్. టి. ఆర్. చట్టంలోని సెక్షన్ 3 (1) ప్రకారం షెడ్యూల్డు ప్రాంతాలలో ఏ వ్యక్తి నుంచి గానీ గిరిజనేతరులకు జరిగే భూమి బదలాయింపు చెల్లదు. ఆ వ్యక్తి ఆదివాసీ కావచ్చు, ఆదివాసీయేతరులు కావచ్చు. ఎవరినుంచయినాసరే భూమి బదలాయింపంటూ జరిగితే అది ఒక ఆదివాసీకి లేదా ఆదివాసీలు మాత్రమే సభ్యులుగా ఉన్న సహకార సంఘానికీ మధ్య జరగాలని ఎల్. టి. ఆర్. చట్టం అంటుంది.

అయితే ప్రభుత్వం కూడా ఈ 'వ్యక్తి' అనే భావన కిందికి వస్తుందా? అంటే ప్రభుత్వం షెడ్యూల్డు ప్రాంతంలో తన అధీనంలో ఉన్న భూమిని గిరిజనేతరులకు బదలాయించవచ్చునా లేక ఆదివాసీలు మాత్రమే దానికి అర్హులా? ఈ ప్రశ్న కొన్ని సంవత్సరాల క్రితం కోర్టు ముందుకు వచ్చింది. విశాఖపట్నం ఏజెన్సీలో బిర్లాలకు చెందిన ఒక కంపెనీకి రాష్ట్ర ప్రభుత్వం కొంత భూమిని గనుల తవ్వకానికి లీజుకిచ్చినప్పుడు, ఆ లీజు చెల్లదని 'సమత' అనే 'ఎన్జీవో' హైకోర్టులో కేసు వేసింది. ఎల్. టి. ఆర్. చట్టంలోని నిషేధంలో 'వ్యక్తి' అన్నది కేవలం మనుషులనేకాక ప్రభుత్వాన్ని కూడా సూచిస్తుందని 'సమత' వాదించింది. మన హైకోర్టు ఒప్పుకోలేదు కానీ అప్పీల్‌ను సుప్రీంకోర్టు ఒప్పుకుంది. సమత వర్సెస్ స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కేసులో జస్టిస్ రామస్వామి ఇచ్చిన తీర్పు ఎల్. టి. ఆర్. చట్టాన్ని వివరంగా వ్యాఖ్యానించింది. ప్రభుత్వం ఏజెన్సీలో గనుల కోసం కానీ, వేరే దేనికోసంకానీ భూములను గిరిజనేతరులకు బదలాయించడానికి వీలులేదంది. ఎల్. టి. ఆర్. చట్టంలోనే కాక 'మైన్స్ అండ్ మినరల్స్ రెగ్యులేషన్ అండ్ డెవలప్‌మెంట్' (ఎం. ఎం. ఆర్. డి.) చట్టంలో కూడా (మరింత ప్రత్యక్షంగా) సెక్షన్ 11 (5)లో ఈ నిషేధం ఉందని సుప్రీంకోర్టు గమనించింది.

ఇప్పుడు ఈ రెండు చట్టాలనూ సవరించి విశాఖపట్నం ఏజెన్సీలో ప్రయివేట్ కంపెనీలకు మైనింగ్ లీజుకివ్వాలని చంద్రబాబు సంకల్పం. ఆదివాసీ సలహా మండలి ముందు ఈ ప్రతిపాదన ఇప్పటికే పెట్టారు. ఈ పని చేయకూడదని సి. పి. ఐ. (ఎం) కు చెందిన ఎం. ఎల్. ఏ. తప్ప వేరే ఎవ్వరూ నిర్ద్వంద్వంగా అనలేదు కానీ ఈ చర్య ఫలితం ఏ విధంగా ఉంటుందో ఇంకొంచెం అధ్యయనం చేసి చూడాలనీ ఇతర రాష్ట్రాలలో ఇటువంటి లీజులిచ్చిన చోట ఏం జరిగిందో చూసిరావాలనీ ఆదివాసీ సలహా మండలి చివరికి తీర్మానించి నిర్ణయాన్ని వాయిదా వేసింది.

రాష్ట్ర అడ్వొకేట్ జనరల్ మాత్రం ఆ రెండు చట్టాలనూ ప్రభుత్వం కోరిన పద్ధతిలో సవరించదలచుకుంటే దానికి ఆటంకమేమీలేదని సలహా ఇచ్చారట. అడ్వొకేట్ జనరల్‌గారు విషయాన్ని ఎంత లోతుగా అధ్యయనం చేసి ఈ సలహా ఇచ్చారో తెలీదు కానీ అది నిజం కాదు.

ఎందుకంటే ఏజెన్సీలో ప్రభుత్వం, ప్రయివేట్ మైనింగ్ లీజులు ఇవ్వడానికి వీలులేదని జస్టిస్ రామస్వామి గారు ఇచ్చిన తీర్పు కేవలం ఎల్. టి. ఆర్. చట్టాన్ని వ్యాఖ్యానించి ఇచ్చింది కాదు. అదే నిజమయితే ఆ చట్టాన్ని రాష్ట్ర అసెంబ్లీ సవరించి వారి తీర్పును వమ్ము చేసి ఉండవచ్చు. కానీ రామస్వామి గారు రాజ్యాంగాన్ని వ్యాఖ్యానించి ఈ నిర్ధారణకు వచ్చారు. రాజ్యాంగంలోని అయిదవ షెడ్యూలు పేరా 5 (2) (ఎ), (బి) లలోనే ఆ నిషేధం అంతర్లీనంగా ఉందని ఆయన అన్నారు. రాజ్యాంగాన్ని వ్యాఖ్యానించి 'దాని భావం ఫలానా' అని చెప్పే అధికారం సుప్రీం కోర్టుకు మాత్రమే ఉంది. ఆ వ్యాఖ్యానాన్ని అధిగమించాలంటే రాజ్యాంగ సవరణ తప్ప వేరే మార్గం లేదు. ఆ అధికారం రాష్ట్ర అసెంబ్లీకి లేదు.

జస్టిస్ రామస్వామి 'సమత' కేసులో ఇచ్చిన తీర్పు ఇంకొక ఆటంకాన్ని కూడా చంద్రబాబు ముందు పెట్టింది. రాజ్యాంగంలోని అయిదవ షెడ్యూలు, షెడ్యూలు ప్రాంతాలలో 'శాంతి, సత్పరిపాలన' ల కోసం గవర్నర్ చేతిలో విస్తృత అధికారాలు ఉంచింది. పార్లమెంట్, అసెంబ్లీలు చేసిన చట్టాలను పక్కనపెట్టి ప్రత్యేక ఆదేశాలు జారీ చేసే అధికారం సహితం ఇచ్చింది. 'శాంతి సత్పరిపాలన' అనేవి ఏ దిశగా ఉండాలో రాజ్యాంగం స్పష్టంగా చెప్పలేదు కానీ రాజ్యాంగంలోని భిన్న విషయాలను సమన్వయపరిచి వ్యాఖ్యానించుకోవాలన్న సాధారణ సూత్రాన్ని ఆధారం చేసుకుని ఆర్టికల్ 15 (4), 46 (1) మొదలయిన అధికరణల వెలుగులో చూసినప్పుడు 'శాంతి, సత్పరిపాలన' అనేవి ఆదివాసీల సామాజిక, ఆర్థిక పురోభివృద్ధిని ప్రాతిపదికగా కలిగి ఉండాలని రాజ్యాంగకర్తల ఉద్దేశం అని జస్టిస్ రామస్వామి వ్యాఖ్యానించారు. కాబట్టి ఆదివాసీల ప్రయోజనాలకు విరుద్ధమైన అంశాలను సత్పరిపాలన పేరిట ఏజెన్సీలో ప్రవేశపెట్టడాన్ని ఈ వ్యాఖ్యానం ప్రకారం రాజ్యాంగం ఒప్పుకోదు. ఈ వ్యాఖ్యానం చంద్రబాబుకు నచ్చకపోవచ్చునుగానీ రాజ్యాంగాన్ని వ్యాఖ్యానించి దాని భావం 'ఇది' అని ప్రకటించే అధికారం సుప్రీం కోర్టుకు మాత్రమే ఉంది. కాబట్టి ఆయన చేయగలిగిందేమీలేదు. మాన్యులు రాష్ట్ర అడ్వొకేట్ జనరల్‌గారు తమ అభిప్రాయాన్ని సవరించుకోవలసి ఉంటుంది.

ఏజెన్సీలో ప్రయివేట్ మైనింగ్ లీజులు ఇవ్వడం ఆదివాసీల మంచికోసమేనని రాష్ట్ర ప్రభుత్వం దబాయించజూస్తున్నది. గనులలోనూ వాటి నుండి తవ్వితీసిన ఖనిజం మీద ఆధారపడ్డ అల్యూమినియం ఫ్యాక్టరీలోనూ ఆదివాసీ యువకులకు చాలా ఉద్యోగాలు వస్తాయట. అందువల్ల ఈ 'అభివృద్ధి' ని కాదనే వారు ఆదివాసీలను వెనుకబాటుతనంలో ఉంచేయాలనుకునే శత్రువులట. ప్రభుత్వమే కాదు, సి. పి. ఐ. నాయకులు పువ్వాడ నాగేశ్వరరావుగారు కూడా ఈ మాటలు అంటున్నారు.

బాక్సైట్ గనులనూ, అల్యూమినియం ఫ్యాక్టరీనీ ప్రభుత్వం ప్రయివేట్ కంపెనీల ద్వారా నడిపించాలని ప్రతిపాదిస్తున్నది. ప్రయివేట్ రంగంలో ఏ రకమైన రిజర్వేషన్లూ మన దేశంలో లేవు. కొత్తగా కల్పించే ఉద్దేశమూ మన పాలకులలో లేదు. రిజర్వేషన్లు లేకుండా ప్రయివేట్ కంపెనీలు తమంతట తాము ఆదివాసీలకు ఉద్యోగాలిచ్చే ప్రసక్తి లేదు.

ప్రయివేట్ గనుల దాకా ఎందుకు, ప్రభుత్వ రంగంలోని సింగరేణి బొగ్గు గనులను చూడవచ్చుగదా. ఖమ్మంలో, ఆదిలాబాద్‌లో, ఇప్పుడు కొత్తగా వరంగల్‌లో ఉన్న సింగరేణి బొగ్గు గనులన్నీ ఆదివాసీ ప్రాంతంలోనే ఉన్నాయి. కానీ కార్మికులలో ఆదివాసీలెంతమంది ఉన్నారు? గని కార్మికుల గురించే మాట్లాడుకుందాం. తవ్వి తీసిన బొగ్గును ముడి సరుకుగా వాడుకునే కంపెనీల గురించి అడగడం వృధా. కొత్తగూడెం, రామగుండంలలోని థర్మల్ విద్యుత్ కేంద్రాలలోనూ, రామగుండంలోని కేంద్ర ప్రభుత్వ ఎరువుల కార్పొరేషన్ ఫ్యాక్టరీలోనూ మంచిర్యాల దగ్గరున్న నస్పూర్‌లోని కోల్ కెమికల్ కాంప్లెక్స్‌లోనూ ఆదివాసీలు ఎంత మంది పని చేస్తున్నారని అడిగి ప్రయోజనం లేదు. బొగ్గు గనుల గురించే అడుగుదాం. అక్కడయినా ఎంత మంది ఉన్నారు? కొత్తగూడెం, ఇల్లందు గనుల కార్మికులలో ఆదివాసీలు ఎంత నిష్పత్తిలో ఉన్నారో —ఆ గనుల వల్ల తరిగిపోయిన అడవులలో ఒకనాడు నివసించిన ఆదివాసీలలో ఎంత మందికి ఆ గనులలో పని దొరికిందో —పువ్వాడ నాగేశ్వరరావుగారికి తెలియదనుకోవాలా? ఖమ్మంలో కొందరికైనా దొరికిందేమోగానీ ఆదిలాబాద్‌లోని గని కార్మికులలో గోండు గిరిజనులకు శూన్యమనే చెప్పుకోవాలి. అటువంటప్పుడు బాక్సైట్ గనుల కథ అంతకంటే భిన్నంగా ఉండబోతుందా?

